క్లుప్తంగా

సత్యదేవునికి వెండి పళ్లెం సమర్పణ



దేవస్థానం ఈఓ సుబ్బారావుకు పళ్లెం అందజేస్తున్న దాత దంపతులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన కె.రఘుమోహన్ గుప్తా, శ్రీలేఖ దంపతులు 820 గ్రాముల వెండి పళ్లాన్ని శనివారం సమర్పించారు. దీని ఖరీదు రూ.92 వేలు అని చెప్పారు. ఈ పళ్లాన్ని సత్యదేవుని ఆలయంలో పూజలకు ఉపయోగించాలని దాత కోరినట్టు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛ భారత్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం యర్రంపాలెం, సూరంపాలెం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 కార్యక్రమం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించే జాతీయ మిషన్‌లో భాగంగా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబి శ్రీనివాస్, డీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనింగ్ లారీలను అడ్డుకున్న స్థానికులు



శంఖవరంలో బైక్‌ను ఢీకొన్న మైనింగ్ లారీ

శంఖవరం: మండల కేంద్రమైన శంఖవరంలో పార్కింగ్ చేసిన బైక్‌ను మైనింగ్ లారీ ఢీకొట్టడంతో శనివారం స్థానికులు లారీలను అడ్డుకున్నారు. భారీ వాహనాల రాకపోకలతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ లారీల రాకపోకలతో దుమ్ము, దూళి లేచిపోవడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. తక్షణమే భారీ వాహనాల రాకపోకలను అధికారులు అడ్డుకోవాలని కోరారు.

నేడు కవలల సమ్మేళనం

బాలాజీచెరువు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం కవలల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ నాళం అండాళ్ శనివారం తెలిపారు. కవల పిల్లల పెంపకం, అలాగే వారి జీవనశైలి, సంప్రదాయ వస్త్ర ధారణ, స్టోరీ టెల్లింగ్, జోడి డ్యాన్స్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి జ్ఞాపిక అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ హాజరవుతారని తెలిపారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

ప్రత్తిపాడుతో మూడు తరాల అనుబంధం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- కిర్లంపూడిలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

కిర్లంపూడి/ఏలేశ్వరం: ప్రత్తిపాడు నియోజకవర్గంతో తమ కుటుంబానికి మూడు తరాల అనుబంధం ఉందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలో బాబు ష్యూరిటీపై మోసం గ్యారంటీ కార్యక్రమంపై శనివారం నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు తన తాతను ఎమ్మెల్యేగా, తన తండ్రి ముద్రగడ పద్మనాభాన్ని ఎమ్మెల్యే, మంత్రిగా చేశారన్నారు. తన తండ్రిని ఉద్యమ నేతగా మార్చింది కూడా ప్రత్తిపాడే అన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని భావించి తనను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమించారన్నారు. తనకు అవకాశం కల్పిస్తే తండ్రి నీతి, నిజాయతీలను కొనసాగిస్తానన్నారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేయాలని, ప్రజల మన్ననలు పొందాలని తన తండ్రి సూచించారన్నారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిలబడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు.

గిరిబాబును ఆశీర్వదించాలి

పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వారసుడిగా గిరిబాబును ఆశీర్వదించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ముద్రగడ ఆశయాలను కొనసాగించే గిరిబాబుకు ప్రజలు అండగా ఉండాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ నీతి, నిజాయితీల కోసం ముద్రగడ పద్మనాభం అహర్నిశలు పని చేశారన్నారు. గిరిబాబుకు పార్టీ తరఫున తామంతా అండగా ఉంటామని, ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో గిరిబాబుకు అవకాశం ఇచ్చి నూతన శకానికి నాంది పలకాలన్నారు. యనమల కృష్ణుడు మాట్లాడుతూ గిరిబాబు నియోజకవర్గ ప్రజలను నుంచి పూర్తి మద్దతు లభిస్తోందన్నారు. అనంతరం ముద్రగడ గిరిబాబు కుమార్తె భాగ్యశ్రీ, కుమారుడు ముద్రగడ పద్మనాభం ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పార్టీ ఏలేశ్వరం పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, జిల్లా అధికార ప్రతినిధి సంకర రాంబాబు, జిల్లా కార్యాచరణ కార్యదర్శి సామంతుల సూర్యకుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండల కన్వీనర్లు గొల్లపల్లి సురేష్, రామిశెట్టి బులిరామకృష్ణ, నరాల శ్రీను, సీహెచ్ సత్యనారాయణ, జెడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరి, గొల్లు చిన్నదివాణం, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కాకి నాని, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, పార్టీ నాయకులు వాసిరెడ్డి జమీలు, గుడాల వెంకటరత్నం, సకురు గుర్రాజు, దో చిట్టిబాబు, జల్లిగంపల ప్రభాకరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

సురక్షితంగా గమ్యం చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్య అప్పారావు

ప్రత్తిపాడు రూరల్: సురక్షితంగా గమ్య స్థానాన్ని చేరుకోవాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఆటో డ్రైవర్లను సూచించారు. ప్రత్తిపాడు లయన్స్ కల్యాణ మండపంలో శనివారం మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ రహదారి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సు, సీబుక్, ఇన్సూరెన్స్, కాలుష్య నిర్ధారణ వంటి అన్ని పత్రాలు వాహనంతో పాటు ఉంచుకోవాలన్నారు. డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం చేయరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ లక్ష్మీకాంతం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రావులపల్లిలో తొలి అడుగు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో శనివారం తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



చిన్నారులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఈఓ విశ్వనాథరాజు

తుని రూరల్: ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా లోవ దేవస్థానం కళావేదికపై శనివారం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. కాకినాడకు చెందిన శ్రీసూర్య సత్య నికేతన్ కళా బృందం నిర్వాహకురాలు ఎం.మహాలక్ష్మి ఆధ్వర్యంలో 80 మంది చిన్నారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేశారు. అమ్మవారి సన్నిధిలో ప్రదర్శన ఇవ్వడం బృందం సభ్యులకు ఎంతో ఆనందాన్నిచ్చిందని నిర్వాహకురాలు మహాలక్ష్మి తెలిపారు. వేదపండితులు కళా బృందం చిన్నారులను ఆశీర్వదించారు. కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు జ్ఞాపికలను అందజేశారు.



లోవదేవస్థానంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

'రంగరాయ'లో క్రీడోత్సవం ప్రారంభం

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో 67వ వార్షికోత్సవ క్రీడోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. రుధిర పేరుతో నిర్వహిస్తున్న ఈ క్రీడోత్సవం రెండు వారాల పాటు జరగనుంది. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ ఈ క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల మనోవికాసం కోసం ప్రతి ఏడాది క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ మేటిగా నిలవాలని ఆకాంక్షించారు. ఆగస్టు 9న జరిగే ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. విజయమే లక్ష్యంగా విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని అన్నారు. క్రీడలు స్నేహభావాన్ని, బృందానుసంధాన్ని పెంపొందిస్తాయని డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. ఆర్ఎంసీ క్రీడల ఉపాధ్యక్షుడు డాక్టర్ ముఖర్జీ మాట్లాడుతూ, క్రీడా స్ఫూర్తిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శశి, క్రీడల ఉపాధ్యక్షురాలు డాక్టర్ శైలజ, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ బాబు, లేడీస్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ లలిత, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. కిర్లంపూడిలో పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సమక్షంలో జె.అన్నవరం గ్రామానికి చెందిన నిమ్మల సీతారాముడు, నేమాని శ్రీనివాసా చౌదరి, కొల్లు చిన్ని వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కో ఆర్డినేటర్ గిరిబాబు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, గోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందక రైతులు గగ్గోలు

- పవన్‌కళ్యాణ్ వెంటనే స్పందించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు

పిఠాపురం: ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు ఇప్పటికే నారుమళ్లు వేశారని, కానీ పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు నీరు రాక నారుమళ్లు వేయక రైతులు గగ్గోలు పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. శనివారం మధ్యాహ్నం నుంచి సీపీఐ కాకినాడ జిల్లా మహాసభల జయప్రదం కోరుతూ పిఠాపురం పట్టణంలో ఇంటింటికీ సీపీఐ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం ఎమ్మెల్యేగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ పిఠాపురంలో రైతులకు న్యాయం చేయడంలో ఘోర వైఫల్యం చెందుతున్నారని అన్నారు. రైతు బాగుంటేనే దేశం, మన ప్రాంతం బాగుంటుందని, అలాంటి రైతు మానసిక క్షోభతో ఉన్నారన్నారు. పవన్‌కళ్యాణ్ వెంటనే పిఠాపురం వచ్చి ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలకు పూర్తి నీరు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో సామర్లకోటలో జరిగే సీపీఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, పట్టణ కార్యదర్శి సాకా రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి కేశవరపు అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవాని, ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ మడగల రమణ, అర్జున్‌రావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం

కాకినాడ సిటీ: తమ ఇళ్లకు అదాని ప్రీ పెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే వద్దని చెప్పాలంటూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా కరపత్రాలు పంచారు. శనివారం రాత్రి కాకినాడ 37వ డివిజన్ సుందరయ్యభవన్ పరిసరాల్లో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం చేసిందన్నారు. అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ప్రతి ఇంటికి ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. గత ప్రభుత్వ సమయంలో టీడీపీ నాయకులు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. కానీ అదే ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లు బిగించడానికి కూటమి ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటరు బిగిస్తే ప్రజలు ముందుగానే సెల్‌ఫోన్ లాగే రీచార్జి చేయించుకోవాలన్నారు. మొబైల్ రీచార్జి అయిపోగానే మొబైల్ కనెక్షన్ ఆగిపోయినట్లు స్మార్ట్ మీటర్ వల్ల విద్యుత్ సౌకర్యం కూడా హఠాత్తుగా ఆగిపోతుందన్నారు. మీటర్‌కు అయ్యే ఖర్చు కూడా 9 సంవత్సరాల పాటు అద్దె రూపంలో వినియోగదారులపై భారం పడుతుందన్నారు. రాత్రి 6 గంటల నుంచి 10 గంటల మధ్యలో విద్యుత్ వినియోగిస్తే ఎక్కువ ధర చెల్లించే విధంగా టైం ఆఫ్ ది డే అనే విధానం కూడా ఈ ఒప్పందంలో ఉందన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లులో రకరకాల పేర్లతో భారీగా చార్జీలు వేస్తున్నారని వివరించారు. సీపీఎం నగర కమిటీ సభ్యులు కె.నాగజ్యోతి, మలక వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ పాల్గొన్నారు.

దోచుకోవడం మీకు అలవాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

- ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మాకు అలవాటు
- టీడీపీ అధికార ప్రతినిధిపై వైఎస్సార్ సీపీ నేతలు ఫైర్

జగ్గంపేట: ఇసుకను దోచుకోవడం, కోడి పందేలు ఆడించడం, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి దందాలు చేయడం మీకు అలవాటు, మిమ్మల్ని చూస్తే గురవింద గింజ సామెత గుర్తుకు వస్తోందని టీడీపీ అధికారి ప్రతినిధి బొదిరెడ్డి సుబ్బారావుపై వైఎస్సార్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి కరుటూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి బొదిరెడ్డి సుబ్బారావు తమపై అవాకులు చవాకులు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. బొదిరెడ్డి తీరు టీడీపీ నేతలకే నచ్చడం లేదని, టీడీపీ ముఖ్యనేతలు సైతం ఆయన తీరును ఎండగడుతున్నారని విమర్శించారు. తమకు రాజకీయాలు చేయడం రాదని నిజాయితీగా ప్రజాసేవ చేయడం, ఎవరికైనా ఆపద వస్తే ఆదుకోవడమే తెలుసు అని చెప్పారు. బొదిరెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరుటూరి వీర్రాజు, గ్రామిక విభాగం అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి, కిర్లంపూడి మండల యువత అధ్యక్షుడు నకిరెడ్డి సుధాకర్, పార్టీ నేతలు భూమాడ గణపతి, సప్పా రఘునాథ్, జగ్గంపేట టౌన్ పార్టీ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, జల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థం.. అనర్థం

- గ్రామాల్లో అమలుకాని ప్లాస్టిక్ నిషేధం
- దుకాణాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



తాండవ నదిలో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కోటనందూరు: మానవ మనుగడకే పెనుసవాలుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు నడుం బిగించాయి. 100 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సమాజంలో ప్రతి పౌరుడు ప్లాస్టిక్ నిషేధాన్ని బాధ్యతగా తీసుకొని అమలు చేయాలని సూచించింది. కాగా పల్లెల్లో ప్రజలు ప్లాస్టిక్ నిషేధాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బహిరంగంగానే ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలును ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది.

183 పంచాయతీల పరిధిలో..

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 183 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని కొంతమేర పాటిస్తున్నా పల్లెల్లో మాత్రం పట్టించుకోవడం లేదు. కిరాణా, కూరగాయలు, మాంసం, ఫ్యాన్సీ దుకాణాలు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో యథేచ్ఛగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను సరఫరా చేస్తున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను యథావిధిగా వినియోగిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులతో పాటు వినియోగదారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పంచాయతీల పరంగా గ్రీన్‌అంబాసిడార్లు సేకరించే చెత్తలో అధిక శాతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉండడం గమనార్హం. గ్రామ శివార్లలో సైతం గుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ దర్శనమిస్తోంది. నదులు, చెరువులు, కాలువల్లో సైతం భారీగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పేరుకుపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్లాస్టిక్ వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు

ప్లాస్టిక్ వినియోగం ద్వారా ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్లాస్టిక్ ఏదో రూపంలో మనిషి శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులతో మనిషి జీవితాన్ని అతలాకుతలం చేస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణాన్ని దెబ్బతీస్తుంది. వాతావరణంలో అసమానతలకు తక్కువ నాణ్యత కలిగిన ప్లాస్లిక్ వినియోగమే కారణం.

అవగాహనతోనే అదుపు

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి, మానవ జీవితానికి వాటిల్లే అనర్థాలపై అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ నిషేధంలో విద్యార్థులు, యువత, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా సంఘాలు, విద్యావంతులను భాగస్వాములు చేసి ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకోవాలి. పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలి. కాలచక్రంలో అసమానతలను తొలగించాలంటే ప్రజలు విస్తృతంగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి. మానవ మనుగడకు పెను సవాలుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. చెట్ల నరికివేతను, ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలి.

లెక్కల స్వామినాయుడు,
రిటైర్డ్ ఎంఈఓ, జగన్నాథపురం

గోవు మానవ జీవనశైలికి పునాది



సమావేశంలో మాట్లాడుతున్న గో సేవ సంయోజిక్ రామారావు

తుని: హిందు సంస్కృతిలో గోవు పవిత్రమైనదని, అది మానవ జీవనశైలికి పునాది అని క్షేత్ర గోసేవ సంయోజిక్ అకుతోట రామారావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గో ఆధారిత ఉత్పత్తుల తయారీపై రెండు రోజులు జరిగే శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గో ఆధారిత ఉత్పత్తులు వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. గో సంస్కృతిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వర్క్‌షాపులో తొలిరోజు పంచగవ్య ఉత్పత్తులు, గో ఆధారిత వ్యవసాయ పద్ధతులు, గో ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆంధ్రాప్రాంత గో సేవ సంయోజిక్ రాంజీ, ఆంధ్ర ప్రాంత ప్రశిక్షణ ప్రముఖ్ కృషి వడ్డీ, ఆంధ్ర ప్రాంత గో సేవ సహ సంయోజిక్ ఓలేటి నారాయణకుమార్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.